సాక్షి సంగారెడ్డి

మంగళవారం । 17 । జనవరి । 2023



పంచాయతీలకు సొంత భవనాలు
కొత్త పంచాయతీలకు భవనాలు మంజూరు కావడంతో ఇబ్బందులు తొలగనున్నాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి. 8లో



'ఏడుపాయల'కు వెళ్తుండగా..
ఏడుపాయల దైవదర్శనానికి వెళ్తుండగా ఆటో, కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలంలో చోటు చేసుకుంది. 8లో



సంక్రాంతి సంబురాలు 9లో
జిల్లా ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇంటి ఆవరణలు రంగురంగుల ముగ్గులతో కొలువుదీరాయి. చిన్నాపెద్ద తేడాలేకుండా గాలిపటాలు ఎగురవేశారు.

న్యూస్‌రీల్

ఆలయ భూముల లీజు రిట్ పిటిషన్ కొట్టివేత

నారాయణఖేడ్: ఖేడ్ పట్టణ శివారులోని శ్రీకాశీ విశ్వనాథస్వామి ఆలయ భూములను వ్యాపారాలకు లీజుకు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ఎనిమిది మంది సామాజిక కార్యకర్తలు వేసిన రిట్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టి వేసింది. ఆలయ భూమిలో హిందు మతస్తులకు కాకుండా అన్యమతస్తులకు లీజుకు ఇస్తే మద్యం, మాంసం దుకాణాలను ఏర్పాటు చేసే వీలుందని, అందువల్ల బహిరంగ వేలం నిలిపివేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ రిట్ పిటిషన్ వేశారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఇప్పటికే బహిరంగ వేలం పూర్తికాగా 167 మంది బిడ్డర్లు పాల్గొన్నారు. ఎక్కువ మొత్తం పాడినవారికే లీజుకు ఇవ్వగా అందులో ఏడుగురు మాత్రమే అన్యమతస్తులు ఉండగా మద్యం, మాంసం తదితర దుకాణాలను ఏర్పాటు చేయరాదని నిబంధన ఉండటంతో రిట్ పిటిషన్‌ను కొట్టివేస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

రైల్వేలైన్ ఏర్పాటుకు చొరవ చూపాలి



మాట్లాడుతున్న రైల్వే సాధన సమితి నాయకులు

జోగిపేట(అందోల్): ఉమ్మడి మెదక్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ వట్టినాగులపల్లి - పటాన్‌చెరు, సంగారెడ్డి, జోగిపేట మీదుగా మెదక్ రైల్వేలైన్ ఏర్పాటుకు ఎంపీలు కొత్త ప్రభాకర్ రెడ్డి, బీబీ పాటిల్‌లు, రైల్వే మంత్రి అశ్వినీవైష్ణవ్‌ని రూ.1,800 కోట్ల నిధుల కేటాయించే విధంగా ప్రత్యేక చొరవ చూపాలని జోగిపేట రైల్వే సాధన సమితి అధ్యక్షుడు మాజీ మార్కెట్ చైర్మన్, గంగా జోగినాథ్, మాజీ మార్కెట్ చైర్మన్లు డీబీ నాగభూషణం, ఎం.మల్లికార్జున్, మాజీ ఎంపీపీ రామాగౌడ్, నాయకులు జూకంటి లక్ష్మణ్, చాపల వెంకటేశం, అల్లే గోపాల్‌లు అన్నారు. వీరు సోమవారం జోగిపేటలో విలేకరులతో మాట్లాడారు. రైల్వే లైన్ కోసం 22 ఏళ్లుగా శ్రమిస్తున్నామని, స్థానిక ప్రజల కోరిక నెరవేరేలా జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. గతంలో సీఎం కేసీఆర్ సూచన మేరకు మంత్రి హరీశ్ రావు సహకారంతో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్‌లు రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిశారని గుర్తు చేశారు. వచ్చే కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఎంపీలు ఈ విషయాన్ని పార్లమెంట్‌లో సభ దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు.

అచ్చంపేట జట్టుకు గోల్డ్‌కప్



గోల్డ్ కప్‌తో అచ్చంపేట జట్టు

జహీరాబాద్: పట్టణంలోని బాగారెడ్డి స్టేడియంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ గోల్డ్‌కప్‌ను అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ జట్టు సొంతం చేసుకుంది. ఆదివారం జరిగిన కిజర్ యాపై గోల్డ్‌కప్ టీ20 ఫైనల్ పోటీలో టైటిల్‌ను దక్కించుకోవడంతో పాటు రూ.5లక్షల ప్రైజ్ మనీ గెలుచుకుంది. రన్నర్‌గా అచ్చంపేటకే చెందిన జట్టు నిలిచింది. బాల్‌రాజ్ జట్టు మొదట బ్యాటింగ్ చేసి 223 పరుగులను సాధించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అచ్చంపేట – 2 జట్టు 120 పరుగులకే ఆలౌట్ అయింది. రన్నర్‌గా నిలిచిన జట్టుకు కప్‌తో పాటు రూ.3లక్షల నగదు పారితోషికాన్ని అందజేశారు. ముగింపు కార్యక్రమానికి మాజీ క్రికెటర్ మునాఫ్‌పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కప్‌ను దక్కించుకున్న సందర్భంగా ఎమ్మెల్యే గువ్వల బాల్‌రాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలకు క్రికెట్ మ్యాచ్‌లు విస్తరించడం సంతోషకరమైన విషయమన్నారు. జాతీయ స్థాయి పోటీలను తలపించేలా పోటీలు నిర్వహించడం హర్షనీయం అన్నారు. పక్షం రోజులుగా జరుగుతున్న పోటీల్లో పలు జిల్లాలకు చెందిన జట్లు పాల్గొన్నాయి.


ఓటమి గెలుపునకు నాంది

కొల్చారం(నర్సాపూర్): ప్రతి ఓటమి గెలుపునకు నాంది అని, మరింత కృషి చేయడం ద్వారా విజయాలు వరిస్తాయని మెదక్ డీఎస్పీ సైదులు పేర్కొన్నారు. సోమవారం కొల్చారం మండలం చిన్నఘనపూర్, సంగాయిపేట గ్రామాల్లో సంక్రాంతి పర్వదినం సందర్భంగా నిర్వహించిన గ్రామస్థాయి క్రికెట్ లీగ్ పోటీల ముగింపు, బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం క్రీడల నిర్వాహకులు ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ హాజరయ్యారు. చిన్నఘనపూర్ క్రికెట్ లీగ్ పోటీలో ఫైనల్ మ్యాచ్‌లో శివాజీ వారియర్ జట్టు, చిన్నఘనపూర్ ఎలెవన్ జట్టుపై విజయం సాధించగా వారికి డీఎస్పీ ట్రోఫీని అందజేశారు.

కోనోకార్పస్‌తో చేటు

- రహదారుల గుండా ఏపుగా పెరిగిన వైనం
- నిషేధించిన ప్రభుత్వం

ప్రజారోగ్యానికి హాని చేస్తున్న మొక్కలు



జీహెచ్‌ఎంసీ ఫంక్షన్‌హాల్‌లో భారీగా పెరిగిన కోనోకార్పస్ మొక్కలు

పటాన్‌చెరు టౌన్: పచ్చదనం మాటున విరివిగా పెరుగుతున్న కోనోకార్పస్ మొక్కలు ప్రజారోగ్యానికి, పర్యావరణానికి పెను ప్రమాదకరంగా మారుతున్నాయి. దుబాయి చెట్టుగా పిలవబడుతున్న ఈవృక్షం ఇప్పటికే పలు దేశాలను కలవరపెడుతోంది. ముఖ్యంగా వీటి పుష్పాలు వెదజల్లె పుప్పొడితో శ్వాసకోశ, అలర్జీ సమస్యలు తలెత్తుతాయనే ప్రచారం ఉంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఈ మొక్కలను నిషేధించింది.

జిల్లా పరిధిలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్– 22, మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, జాతీయ రహదారి డివైడర్ల మధ్య, గ్రామాల్లో విరివిగా «కోనోకార్పస్» మొక్కలు నాటారు. ఇప్పటికే ఇవి చెట్లుగా మారాయి. ప్రతి చెట్టుకు పుష్పాలు రాగా.. అవి వెదజల్లె పుప్పొడితో పలు శ్వాసకోశ వ్యాధులు, అలర్జీ సమస్యలు తలెత్తుతున్నాయి. పర్యావరణ సమస్యలకు కారణమవుతోందన్న కారణంతో కోనోకార్పస్ మొక్కలు నాటడాన్ని రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. హరితహారం కార్యక్రమంలో తొలుత ఈ మొక్కలనే ఎక్కువగా వినియోగించిన ప్రభుత్వం ప్రజారోగ్యానికి చేస్తున్న హానిని గుర్తించి నిషేధించింది.

పలు ఆరోగ్య సమస్యలకు కారణం

కోనోకార్పస్ మొక్క పర్యావరణానికి హాని చేయడంతో పాటు ప్రజారోగ్య సమస్యలకు కారణమవుతోందని పొరుగుదేశమైన పాకిస్తాన్ గుర్తించింది. ముఖ్యంగా కరాచీ నగరంలో హఠాత్తుగా పెరుగుతున్న ఊపిరితిత్తుల వ్యాధిగ్రస్తుల సంఖ్యకు ఈమొక్కలే కారణమని పరిశోధనల్లో తేల్చింది. అధిక సంఖ్యలో భూగర్భజలాలను వినియోగించుకునే సామర్థ్యం కలిగిన ఈ మొక్కలతో పర్యావరణానికి చేటని మరికొన్ని అరబ్‌దేశాలు గుర్తించాయి.

అధికారులు చర్యలు తీసుకోవాలి



మహారాష్ట్రలోని పూణేలో కోనోకార్పస్ మొక్కలు నాటడాన్ని నిషేధించినట్టు మన రాష్ట్రంలో కూడా మొక్కలు పెరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. జిల్లాలో చాలా చోట్ల వేగంగా మొక్కలు పెరుగుతున్నాయని నాటుతున్నారు. పర్యావరణ సమతుల్యానికి విఘాతం కలిగించే ఏ అంశాన్నైనా ప్రభుత్వాలు అడ్డుకోవాలి.

– గడ్డం శ్రీనివాస్ ముదిరాజ్, పటాన్‌చెరు

మొక్కలను తొలగిస్తున్నాం



పర్యావరణానికి ముప్పుగా మారుతున్న కోనోకార్పస్ మొక్కల తొలగింపునకు ఇప్పటికే చర్యలు చేపట్టాం. ఎక్కడైతే పుష్పాలు వస్తున్నాయో వెంటనే వాటిని తొలగిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్‌లో నిర్వహించే హరితహారంలో వీటి స్థానంలో కొత్త మొక్కలు నాటుతాం.

– బన్సీలాల్, ఎంపీడీఓ, పటాన్‌చెరు

ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

కలెక్టర్ డాక్టర్ శరత్



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని ఈనెల 25న ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి 13వ జాతీయ ఓటరు దినోత్సవ వేడుకల నిర్వహణపై స్వీప్ నోడల్ అధికారి, ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఎమ్మెన్నార్ మెడికల్ కళాశాల, తారా డిగ్రీ కళాశాల, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఏఈఆర్‌ఓలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ ఓటర్ దినోత్సవాన్ని కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నిర్వహించాలని సూచించారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కొత్తగా నమోదైన ఓటర్లను సన్మానించి వారికి(ఎపిక్ కార్డ్) ఓటరు కార్డు అందజేయాలన్నారు. జిల్లా కేంద్రంలో జిల్లా ఎన్నికల అధికారి జాతీయ ఓటరు దినోత్సవ వేడుకను వివిధ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్, పంచాయతీరాజ్, సివిల్ సొసైటీ గ్రూప్స్, యూత్ వలంటరీస్, ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్ర, మీడియా తదితరుల సమన్వయంతో నిర్వహించాలని సూచించారు. జాతీయ ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞను చేయించాలన్నారు. ఈ సమావేశంలో స్వీప్ నోడల్ అధికారి సురేశ్ మోహన్, రెవెన్యూ డివిజన్ అధికారి నగేశ్, ప్రభుత్వ ప్రైవేటు మెడికల్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, తారా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవిందరామ్, ఏఈఆర్‌ఓలు, కలెక్టరేట్ ఏవో మహిపాల్ రెడ్డి, ఎన్నికల విభాగపు సూపరింటెండెంట్ తిరుమల రావు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా 'కంటి వెలుగు'

సంగారెడ్డి టౌన్: జిల్లాలో కంటి వెలుగు శిబిరాలను ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభిస్తామని కలెక్టర్ శరత్ పేర్కొన్నారు. పకడ్బందీగా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, ప్రజలకు సౌకర్యంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం కంటి వెలుగు శిబిరాల నిర్వహణపై ఆర్థిక వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు సీఎస్ శాంతికుమారి, డీజీపీ అంజనీకుమార్, వైద్య, ఆరోగ్యశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ రిజ్వీతో కలిసి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కంటివెలుగు కార్యక్రమ నిర్వహణపై పలు సూచనలు చేశారు. జనవరి 19న ఉదయం 9 గంటలకు ఆయా ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, శాసనమండలి సభ్యులు, జెడ్పీ చైర్మన్లు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించాలని ఆదేశించారు. కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. శిబిరాల వద్ద భద్రత కల్పించాలని పోలీస్ అధికారులకు సూచించారు. కంటి వెలుగు బృంద సభ్యులు ప్రతిరోజు ఉదయం 8.45 గంటల లోపు క్యాంపుకు చేరుకునేలా చూడాలని డీఎంహెచ్‌ఓకు ఆదేశించారు. శిబిరాలకు వచ్చే ప్రజలు తప్పనిసరిగా ఆధార్‌కార్డు తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ రాజర్షిషా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రిదేవి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్



కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న చింతా ప్రభాకర్

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడుతాయని రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామంలో అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కబడ్డీ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, అందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. గ్రామీణస్థాయి నుంచి మంచి క్రీడాకారులు పుట్టుకొస్తున్నారని, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని సూచించారు. గ్రామాభివృద్ధికి సంపూర్ణ సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతుబంధు అధ్యక్షుడు అమరేందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్ రత్నాకర్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు, ఎంపీటీసీ మాధవరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయల అమ్మవారికి పూజలు

పాపన్నపేట (మెదక్): అశేష భక్తజనంతో ఏడుపాయల ఆదివారం కిటకిటలాడింది. వేల భక్తులు దుర్గమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసి, బోనాలు, తలనీలాలు, ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా పాలకవర్గ చైర్మన్ బాలాగౌడ్, ఈవో శ్రీనివాస్, పాలక వర్గ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

ప్రజావాణితో సమస్యలు పరిష్కారం




అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ శరత్

కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి టౌన్: సమస్యల పరిష్కారానికే ప్రజావాణి నిర్వహిస్తున్నామని, అర్జీలను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి 13 అర్జీలు వచ్చాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అట్రాసిటీ కేసు పరిహారం విషయంలో లంచం డిమాండ్ చేసిన కోహీర్ తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్‌ను కలెక్టర్ సస్పెండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వడం లేదు



మొగులయ్య

తన భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ గురించి హత్నూర తహసీల్దార్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం కింద దరఖాస్తు చేసుకొని 96 రోజులు గడిచినా నేటికీ సరైన సమాచారం ఇవ్వడం లేదని హత్నూర మండలం సిరిపురం గ్రామానికి చెందిన మొగులయ్య అర్జీ సమర్పించారు. తన సమస్యను గుర్తించి న్యాయం చేయాలని కోరాడు. అలాగే గుమ్మడిదల మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన గెన్యా వారసత్వంగా వచ్చిన 20 గుంటల భూమిని పహనీలో చేర్చాలని కోరుతూ ప్రజావాణిలో అర్జీ అందజేసింది

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

నర్సాపూర్ రూరల్: బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని డీఈఓ రమేశ్ కుమార్ తల్లిదండ్రులకు సూచించారు. సోమవారం నర్సాపూర్ మండలం నారాయణపూర్ పంచాయతీ పరిధిలోని గంగారాం తండాలో కొనసాగుతున్న బడి బయట పిల్లల సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ.. 6 నుంచి 19 ఏళ్ల పిల్లలతో కూలీ, వ్యవసాయ పనులు చేయించొద్దని సూచించారు. చదువు మానేసిన పిల్లలను బడిలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలన్నారు. చదువుతోనే ఏదైనా సాధించొచ్చన్నారు. అనంతరం మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా నారాయణపూర్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రహరీ, మూత్ర శాలలు, నల్లాల ఏర్పాటుపై కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. డీఈఓ వెంట సీఆర్పీ భైరవ రెడ్డి ఉన్నారు.



బాలుడితో మాట్లాడుతున్న రమేశ్ కుమార్

మమ అనిపిస్తున్నారు!

మొక్కుబడిగా మండల సమావేశాలు

- హాజరుకాని అధికారులు, ప్రజాప్రతినిధులు
- కోరం కోసం గంటలతరబడి ఎదురుచూపులు
- చర్చల్లో పాల్గొనని మహిళా సభ్యులు
- పరిష్కారానికి నోచుకోని సమస్యలు



కోహీర్ మండల సమావేశం(ఫైల్)

కోహీర్(జహీరాబాద్): మండల స్థాయిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశాలకు అధికారులు ధుమ్మా కొడుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఫలితంగా గ్రామాల్లో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల ఉదాసిన వైఖరితో సమావేశాల లక్ష్యం నీరుగారిపోతోంది. ప్రతి సమావేశానికి జిల్లా పరిషత్ చైర్మన్‌తో పాటు ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ఆహ్వాన పత్రాలను అందజేస్తున్నారు. 17 అంశాలపై చర్చించడానికి కలెక్టర్‌తో పాటు 32 మంది ఉన్నతాధికారులు పాల్గొనాలని ఆదేశాలు ఉన్నాయి. అయితే ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరైన సందర్భాల్లో మాత్రమే సమావేశాలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. ఇతర సందర్భాల్లో సమావేశాలను మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు.

- సమావేశాలకు హాజరు కాని అధికారులు, ప్రజాప్రతినిధులపై కఠినమైన చర్యలు లేకపోవడంతో సమావేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. సమావేశం నిర్వహించడానికి కోరం కోసం గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. సభ్యులకు ఫోన్లు చేసి పిలిపించవలసిన దుస్థితి ఏర్పడుతోంది. కోరం లేక సమావేశాలను వాయిదా వేసుకోవాల్సిన పరిస్థితి ఎదురవుతుందంటే ఎంపీపీ సమావేశాలకు లభిస్తున్న ఆదరణను ఇట్టే అర్థం చేసుకోవచ్చు.
- అధికారులు సైతం సమావేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. పలువురు ఉన్నతాధికారులు తమ కిందిస్థాయి సిబ్బందిని సమావేశాలకు పంపించి చేతులు దులుపుకుంటున్నారు. ఆయా శాఖలకు సంబంధించిన నివేదికలు, గత సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి తీసుకున్న నిర్ణయాలను సైతం తెలియజేసే నివేదికలను సైతం సమర్పించడంలేదు. ప్రజా ప్రతినిధుల్లో కొందరు సమస్యల పట్ల అవగాహన లేక, న్యూనతాభావంతో మరికొందరు, చర్చించినా ఫలితం లేదని మరికొందరు సమస్యలను లేవనెత్తడం లేదు.

చర్చల్లో మహిళల పాత్ర శూన్యం!

మహిళా ప్రజా ప్రతినిధుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కోహీర్ మండలానికి సంబంధించి 24 మంది సర్పంచుల్లో 13 మంది, 18 మంది ఎంపీటీసీలకు ఎనిమిది మంది మహిళలు ఉన్నారు. చాలా మంది మహిళా ప్రతినిధుల భర్తలు, వారి కుటుంబ సభ్యులు రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషిస్తున్నారు. ఇతర సభలు సమావేశాల్లో వారే అధిపత్యం చెలాయిస్తున్నారు. మండలంలోని మహిళా ప్రతినిధుల్లో ఒకరిద్దరు మినహా మిగతా సభ్యులు నోరుమెదపకుండా సైలెంట్‌గా హాజరై వెళ్లిపోతున్నారు.

పనులు జరగడం లేదు



గురుజువాడ గ్రామంలోని 18 విద్యుత్ స్తంభాలకు లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వృథా కావడంతో పాటు తరుచు బల్బులు పాడవుతున్నాయి. ఫలితంగా పంచాయతీకి నష్టం వస్తోంది. దీంతో పాటు గ్రామంలో నెలకొన్న పలు సమస్యలపై సమావేశంలో లేవనెత్తినా అధికారులు పట్టించుకోవడం లేదు. నాలుగేళ్లుగా సమస్యలు పెండింగులోనే ఉన్నాయి.

– సంగారెడ్డి, గురుజువాడ సర్పంచ్

అందరికీ ఆహ్వాన పత్రాలు



అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరికీ సమావేశాలకు సంబంధించి ఆహ్వానపత్రాలను అందజేస్తున్నాం. సమావేశానికి నివేదికలతో హాజరు కావాలని స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నాం. సమావేశానికి ముందు రోజు ఫోన్లు చేస్తున్నాం. అయినా అధికారులు కొందరు సమావేశాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నాం. అయినా మార్పు రావడంలేదు.

– సుజాతనాయక్, ఎంపీడీఓ కోహీర్

క్లుప్తంగా

కబడ్డీ పురాతనమైన క్రీడ

కొండపాక(గజ్వేల్): కబడ్డీ పురాతనమైన గ్రామీణ క్రీడ అని ఎమ్మెల్సీ వంటేరు యాదవ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన జిల్లా కబడ్డీ టోర్నీ సోమవారం రాత్రి ముగిసింది. ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మద్దూర్ మండలంలోని సంజీవని ప్రథమ బహుమతి, జగదేవ్‌పూర్ మండలంలోని శివాజీ టీం ద్వితీయ, తృతీయ స్థానంలో దుద్దెడ కబడ్డీ క్లబ్ టీంలే విజేతలుగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు, ,దుద్దెడ కబడ్డీ క్లబ్ అధ్యక్షుడు ఆరెపల్లి మహదేవ్‌గౌడ్, ఎంపీటీసీలు గురజాడ బాలాజీ, పిల్లి శిరీష, కబడ్డీ ఇంటర్నేషనల్ ప్లేయర్ మద్ది మహేందర్‌రెడ్డి, త్రీటౌన్ సీఐ భాను ప్రకాష్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి కుంటనోళ్ళ శివ కుమార్, ఉపసర్పంచ్ గుండెల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం


కొడకండ్లలో దగ్ధమవుతున్న గడ్డివాము

గజ్వేల్‌రూరల్: ప్రమాదవశాత్తు గడ్డివాము దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని కొడకండ్ల గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కప్పెర యాదయ్య వ్యవసాయ పొలం వద్ద పశుగ్రాసం కోసం ఉంచిన గడ్డివాముకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు అంటించాడు. దీంతో 400 మోపుల గడ్డి దగ్ధమైనట్లు బాధిత రైతు పేర్కొన్నాడు. ఫైర్ ఇంజన్ వచ్చినప్పటికీ గడ్డిమోపులు కాలిపోయి తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం చొరవ చూపి తనకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాడు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

సిద్దిపేటరూరల్: అనుమానాస్పద స్థితిలో యువకుడు చెట్టుకు ఉరి వేసుకొని మృతిచెందిన ఘటన సిద్దిపేట జిల్లా చింతమడక శివారులో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ మురళి వివరాల ప్రకారం దుబ్బాక మండలం పద్మశాలిగడ్డకు చెందిన రెడ్డబోయిన చందు (20) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు సోమవారం ఉదయం నుంచి వెతకడం ప్రారంభించారు. సమీప అటవీ ప్రాంతంలో చందు చెట్టుకు ఉరేసుకొని కనిపించడంతో స్థానిక యువత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతిపై అనుమానం ఉందని మృతుడి సోదరుడు శ్రీనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

పంచాయతీలకు సొంత భవనాలు

- ఉపాధి హామీ నిధులతో నిర్మాణం
- 69 గ్రామాలకు.. రూ. 13.8 కోట్లు మంజూరు


అద్దె భవనంలో కొనసాగుతున్న కొమురవెల్లి మండలం రసూలాబాద్ పంచాయతీ భవనం

సాక్షి, సిద్దిపేట: నూతన పంచాయతీల్లో ఇబ్బందులు తొలగనున్నాయి. సొంత భవనాలు లేక కిరాయి ఇళ్లు.. చెట్ల కింద కొనసాగే దుస్థితి దూరం కానుంది. ప్రభుత్వం జిల్లాకు 69 భవనాలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కో పంచాయతీకి రూ. 20 లక్షల చొప్పున మొత్తం రూ. 13.8 కోట్లు మంజూరు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

కొత్తగా 102 పంచాయతీలు

- జిల్లాలో గతంలో 399 గ్రామ పంచాయతీలుండగా, అందులో రెండు పంచాయతీలు మున్సిపాలిటీలో విలీనం అయ్యాయి.
- 500 జనాభా ఉన్న 102 గ్రామాలను కొత్తగా పంచాయతీలుగా ఏర్పాటు చేయడంతో జిల్లాలో మొత్తం 499 గ్రామ పంచాయతీలకు చేరింది.
- వీటికి సొంత భవనాలు లేకపోవడంతో 27 అద్దె భవనాల్లో, మరికొన్ని ఫ్రీ రెంట్‌గా కొనసాగుతున్నాయి.
- కొన్ని పంచాయతీ భవనాలు శిథిలావస్థకు చేరగా.. మరికొన్ని ఇరుకుగా ఉన్నాయి.
- పంచాయతీలు ఏర్పడి నాలుగేళ్లు కావొస్తున్నా నేటికీ సొంత భవనాలు లేకపోవడంతో కార్యకలాపాల నిర్వహణలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
- ఈక్రమంలో సొంత భవనాల నిర్మాణాలకు సంబంధించి ఇటీవల గ్రామీణాభివృద్ధి శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.
- జాతీయ ఉపాధి హామీ పథకం కింద వీటి నిర్మాణాలు చేపట్టాలని సూచించింది. ఆయా గ్రామ పంచాయతీల్లో ఎక్కడ నిర్మించాలనేది కలెక్టర్ నిర్ణయించనున్నారు.
- త్వరలో కలెక్టర్ ఆమోదంతో ఆయా గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయనున్నారు.
- పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో నిర్మాణాలు జరగనున్నాయి.
- గతంలో భవన నిర్మాణ అంచనా వ్యయం రూ. 10 లక్షలు ఉండగా.. మంజూరైన గ్రామాల్లో నిధులు చాలక నిర్మాణ వ్యయం రూ. 16 లక్షలకు పెంచారు.
- నిర్మాణ సామగ్రి ధరలు పెరగడంతో తాజాగా రూ. 20 లక్షలు అవుతుందని అధికారులు అంచనా వేశారు.
- భవన నిర్మాణానికి ఆయా పంచాయతీల్లో ప్రభుత్వ స్థలం చూపించాల్సి ఉంటుంది.
- పంచాయతీ తీర్మానం మేరకు భవనాలు నిర్మించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

తొలగనున్న ఇబ్బందులు

- అభివృద్ధిలో భాగంగా పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, నర్సరీలు, డంపింగ్ యార్డులు, పల్లె క్రీడా ప్రాంగణాలు నిర్మించారు.
- కార్యదర్శులతో పాటు సిబ్బందిని సైతం నియమించారు. చాలా చోట్ల పంచాయతీలకు సొంత భవనాలు లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, షెడ్లలో నిర్వహిస్తున్నారు.
- గ్రామసభలు, ఇతర సమావేశాలను సైతం చెట్ల కిందనే కానిస్తున్నారు. భవనాలు లేక కంప్యూటర్లు, ఇతర సామగ్రిని కొనుగోలు చేయలేకపోతున్నారు.
- ఈక్రమంలో నూతన పంచాయతీలకు సొంత భవనాలు మంజూరు కావడంతో ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

త్వరలో పనులు ప్రారంభిస్తాం



జిల్లాలో 69 గ్రామ పంచాయతీలకు నూతన భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరయ్యాయి. ఒక్కో గ్రామ పంచాయతీ భవనానికి రూ. 20 లక్షల చొప్పున కేటాయించారు. త్వరలో పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు కృషి చేస్తాం.

– గోపాల్‌రావు, డీఆర్డీఏ

గుండెపోటుతో సర్పంచ్ మృతి


పొట్టి పల్లి సర్పంచ్ ధన్ రాజ్ పాటిల్ (ఫైల్)

ఝరాసంగం(జహీరాబాద్): గుండెపోటుతో సర్పంచ్ మృతి చెందిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు గ్రామస్తుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి...పొట్టి పల్లి గ్రామ సర్పంచ్ ధన్ రాజ్ పాటిల్(72) ఆదివారం ఉదయం మృతి చెందాడు. సోమవారం మధ్యాహ్నం పొట్టి పల్లి గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు కేంద్ర రసాయనల శాఖ మంత్రి భగవత్ కుభా, సీడీసీ చైర్మన్ ఉమాకాంత్ పాటిల్, జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్ షెట్కార్, టీపీసీసీ కార్యదర్శి సునీత పాటిల్, సభ్యుడు నరోత్తం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్ రావు పాటిల్, ఎంపీడీఓ సుజాత, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, మాజీ అధ్యక్షుడు రుద్రప్ప పాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్ శంకర్ పాటిల్, నాయకులు నరేష్ కుమార్, అరవింద్ జెట్టి, అశోక్ కుమార్ పాటిల్, సంగ్రామ్ పటేల్, మారుతి రావు పాటిల్, వీర్ శెట్టి, సిద్ధన్నపాటిల్, శ్రీనివాసరెడ్డి, కృష్ణ, బస్వరాజ్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం


అర్చన

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రామనాయుడు కథనం ప్రకారం .. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన అంజనేయులు కూతురు అర్చన(25) ఎంఎస్సీ వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ నెల 13వ తేదీన ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్‌ను సైతం ఇంట్లో వదిలి వెళ్లింది. దీంతో కూతురు అదృశ్యంపై తండ్రి అంజనేయులు సోమవారం ఫిర్యాదు చేయగా ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాల ప్యాకెట్‌కు వెళ్లిన యువతి


సౌందర్య

పటాన్‌చెరు టౌన్: ఇంటి నుంచి పాల ప్యాకెట్ కోసం వెళ్లి ఓ యువతి అదృశ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండల పరిధిలోని ఇంద్రేశం గ్రామానికి చెందిన బుచ్చయ్య రెండో కూతురు సౌందర్య(26) పదో తరగతి వరకు చదివి ఇంటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో 15వ తేదీన సాయంత్రం ఇంటి నుంచి పాల ప్యాకెట్ కోసం బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో కూతురు అదృశ్యంపై తండ్రి బుచ్చయ్య సోమవారం ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక సమస్యలతో యువకుడి ఆత్మహత్య


మహేశ్ యాదవ్ (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాళ్ళకల్ గ్రామానికి చెందిన దోర్ల మహేశ్‌యాదవ్ (33) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజులుగా ఆర్థిక సమస్యలతో సతమతమవుతూ సోమవారం ఇంట్లో సీలింగ్‌కు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహేశ్‌ను కిందికి దించి చికిత్సకు మేడ్చల్‌కు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. మృతుడికి భార్య సరళ, ఇద్దరు కుమారులు, ఒక కూతురు న్నారు. ఈ విషయమై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

పతంగి ప్రాణం తీసింది

బైక్ ఢీకొని బాలుడి మృతి


రోహిత్ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: తెగిపోయిన గాలిపటాన్ని పట్టుకోవడానికి తొమ్మిదేళ్ల బాలుడు జాతీయ రహదారిపై పరుగులు తీశాడు...అదే చివరి పరుగు అయ్యింది. ఈ దుర్ఘటన ఆదివారం పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముస్తాక్ కుటుంబం బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్‌నకు వచ్చి అక్కడే గుడిసెల్లో నివాసం ఉంటోంది. అతనికి భార్య, ముగ్గురు పిల్లలు. సంక్రాంతి పండగను పురస్కరించుకొని రెండో కుమారుడు రోహిత్(9) ఇస్నాపూర్ నుంచి రహదారి వెంబడి ఎగురుతున్న గాలిపటాలను చూసుకుంటూ పటాన్‌చెరు నోవాపాన్ చౌరస్తా వరకు వచ్చాడు. అక్కడ తెగివస్తున్న గాలిపటాన్ని చూస్తూ రోడ్డుపై వస్తున్న వాహనాలను గమనించకుండా వేగంగా దాటబోయాడు. ఈలోగా ఇస్నాపూర్ నుంచి వస్తున్న ద్విచక్ర వాహనదారుడు బాలుడు రోహిత్‌ను బలంగా ఢీకొట్టాడు. తీవ్ర గాయాలపాలైన బాలుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు.

నడుం వంచుతాం.. నాటేస్తాం



గజ్వేల్ : ఎటుచూసినా విస్తారంగా వరినాట్లు వేస్తున్న దృశ్యాలే కనిపిస్తున్నాయి. కూలీల సమస్య ఉత్పన్నం కావడంతో పొరుగు రాష్ట్రాలకు చెందిన కూలీలతో నాట్లు వేయించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోమవారం గజ్వేల్ మండలం అహ్మదీపూర్‌కు చెందిన రైతు బోయిన లింగం తన కున్న రెండెకరాల్లో బీహార్, కోల్‌కత్తాలకు చెందిన మగకూలీలతో నాట్లు వేయించాడు.

కొమురెల్లి మల్లన్న దర్శనానికి వెళుతూ..

బైక్‌ను ఢీకొట్టిన ట్రాలీ.. విద్యుత్ ఉద్యోగి దుర్మరణం


బాలయ్య(ఫైల్)

వర్గల్(గజ్వేల్): కొమురెల్లి మల్లన్న దర్శనానికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో విద్యుత్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఈ ఘటన వర్గల్ మండలం నాచగిరి సమీప అనంతగిరిపల్లి మలుపు వద్ద జరిగింది. గౌరారం ఎస్‌ఐ సంపత్‌కుమార్ వివరాల ప్రకారం... జోగిపేటకు చెందిన ఒగ్గు బాలయ్య(52) అందోల్ మండలంలో విద్యుత్ శాఖలో అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్నాడు. సంక్రాంతి సందర్భంగా ఆదివారం కొమురవెల్లి మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు ఉదయం 7.30 గంటలకు అల్లుడు ఊస శ్రీశైలంతో కలిసి బైక్‌మీద బయల్దేరాడు. గజ్వేల్–తూప్రాన్ రోడ్డులో వర్గల్ మండలం నాచగిరి సమీప అనంతగిరిపల్లి మలుపు వద్ద వీరి బైక్ను ఎదురుగా వస్తున్న ట్రాలీ ఢీకొట్టింది. ప్రమాదంలో గాయపడిన బాలయ్యను 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను చనిపోయినట్లు ధ్రువీకరించారు. మృతదేహానికి గజ్వేల్ ఆస్పత్రిలో పోస్టుమార్టం చేయించి, మృతుడి కొడుకు తులసేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా మృతుడి కొడుకుకు ఇటీవలే వివాహ నిశ్చయమైంది. త్వరలోనే వివాహం జరగాల్సి ఉండగా ఇంతలోనే తండ్రి మృతి చెందడంతో కుటుంబంలో పెనువిషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురి మృతి


జిన్నా ప్రవీణ్ (ఫైల్)

నిజాంపేట(మెదక్): మూడు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు యువకులు మృత్యువాతపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... రామాయంపేట మండల పరిధిలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన జిన్నా ప్రవీణ్(28) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఆదివారం సాయంత్రం తన బైక్‌పై బచ్చురాజ్‌పల్లి గ్రామానికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా అతివేగం, అజాగ్రత్త వల్ల రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టాడు. హెల్మెట్ లేకపోవడంతో తలకు, ముక్కుకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సోమవారం ఉదయం కుటుంబీకులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి సిద్దయ్య ఫిర్యాదు మేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

తూప్రాన్‌లో..

తూప్రాన్: సంక్రాంతి పండగ సందర్భంగా జాతరకు వెళుతూ ఓ యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన గుమ్మడి శ్రీకాంత్(28) తన స్నేహితులు సుబ్రమాణ్యం, మాణిక్యంతో కలిసి బైక్‌పై మండలంలోని ఇస్లాంపూర్ గ్రామ సమీపంలోని రామప్ప జాతరకు బయలు దేరారు. బైపాస్ మార్గంలోని హనుమాన్ దేవాలయం సమీపంలో వీరి బైక్ రహదారి మధ్యలోని డివైడర్‌ను అతివేగంగా ఢీకొట్టింది. ఈ ఘటన శ్రీకాంత్ అక్కడికక్కడే మృతి చెందగా, మిగతా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

జహీరాబాద్‌లో...


కృష్ణ మృతదేహం

జహీరాబాద్: మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామ శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హోతి(బి) గ్రామానికి చెందిన బోయిని కృష్ణ(24) మోటారు సైకిల్‌పై జహీరాబాద్ వెళ్తుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందన్నారు. తీవ్రంగా గాయపడిన కృష్ణను సంగారెడ్డి ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో మరో ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ మేరకు జహీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దొంగిలించిన వాహనంపై వెళుతూ..

ప్రమాదానికి గురై వ్యక్తి మృతి


గుర్తు తెలియని యువకుడి మృతదేహం

జోగిపేట(అందోల్): చోరీ చేసిన బైక్‌పై వెళుతూ మండల పరిధిలోని అల్మాయిపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు జోగిపేట ఎస్‌ఐ సామ్యానాయక్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్ ఏరియాలోని చిలకలగూడ ప్రాంతానికి చెందిన హోండా యాక్టివాను చోరీ చేసి అందోలు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆదివారం అర్ధరాత్రి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని జోగిపేట ఏరియా ఆస్పత్రిలో భద్రపరిచారు. ప్యాంటు, షర్టు ధరించిన ఆ యువకుడిని గుర్తించేందుకు ఆస్పత్రిలో అందుబాటులో ఉంచారు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే 8712656753 ఫోన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

పడుకున్న చోటే ..


కస్‌హే మృతదేహం

పటాన్‌చెరు టౌన్: పడుకున్న చోటే ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ ప్రసాద్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌లోని గోరక్‌పూర్‌కు చెందిన రామచంద్ర అతడి సోదరుడు కస్‌హే(42) నాలుగేళ్ల క్రితం పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని రూసత్ టింబర్ డిపోలో పనిచేసుకుంటూ అక్కడే ఉంటున్నారు. అయితే కస్‌హే గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో 14వ తేదీన రాత్రి భోజనం చేసిన తర్వాత వాంతులు చేసుకున్నాడు. దీంతో సోదరుడు శుభ్రం చేయించి పడుకోబెట్టాడు. తిరిగి 15వ తేదీన ఉదయం కస్‌హేను నిద్ర లేపేందుకు చూడగా, ఎంత లేపినా లేవలేదు. పరిశీలించి చూడగా మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి సోదరుడు రామచంద్ర తన తమ్ముడు మృతిపై ఎలాంటి అనుమానం లేదని, గుండెపోటులో మృతిచెంది ఉండవచ్చని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుపాయల్లో గుర్తు తెలియని మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పాపన్నపేట (మెదక్) : వనదుర్గా ప్రాజెక్టు సమీపంలోని దుకాణాల వెనుక చెట్ల పొదల్లో గుర్తు తెలియని మృతదేహం ఆదివారం లభ్యమైనట్టు ఎస్‌ఐ విజయ్ కుమార్ తెలిపారు. మృతుడికి సుమారు 50 నుంచి 55 ఏళ్ల వయస్సు ఉంటుందని, శరీరంపై ఆరెంజ్ రంగు చొక్కా, నలుపు రంగు నెక్కరు ఉందన్నారు. మృతదేహం పక్కన టిఫిన్ బాక్సు కూడా ఉందన్నారు. అనారోగ్యంతో రెండు రోజుల క్రితం మృతిచెంది ఉంటాడని ప్రాథమిక అంచనాకు వచ్చినట్టు చెప్పారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ వివరించారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే పాపన్నపేట పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు. 94406 27014కు ఫోన్ చేయాలన్నారు.

భార్యను హత్య చేసిన భర్త


వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు


వాగులో తేలిన లక్ష్మి మృతదేహం

రేగోడ్(మెదక్): భార్యను భర్త హతమార్చిన సంఘటన మండల పరిధిలోని చౌదర్‌పల్లిలో వెలుగు చూసింది. ఈ విషయం తెలుసుకున్న అల్లాదుర్గం సీఐ జార్జి, ఎస్‌ఐ సత్యనారాయణ హుటాహుటిన అక్కడకు చేరుకుని హత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దశంకరంపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన లక్ష్మి (35) రేగోడ్ మండలంలోని చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కేశయ్య మేనత్త మూడో కూతురు. వీరికి 17 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. కొన్ని గొడవల నేపథ్యంలో వేర్వేరుగా ఉంటున్నారు. కేశయ్య ఐదేళ్ల క్రితం రెండో వివాహం చేసుకున్నాడు. ఈ విషయం లక్ష్మికి కూడా తెలుసు. అయితే మేనమామ ఆరోగ్యం బాగా లేదని చౌదర్‌పల్లి గ్రామానికి సోమవారం సాయంత్రం 4:30 నిమిషాలకు వెళ్లి వస్తుండగా మార్గమధ్యలో వాగు వద్ద భర్త కేశయ్య, అతని సోదరుడు యోహన్‌లు కలిసి లక్ష్మి, ఆమె సోదరి పోచమ్మపై దాడి చేశారు. లక్ష్మి మెడపై కత్తితో కోసి వాగులో పడేసి బండ రాళ్లతో మోది చంపారు. ఈ ఘర్షణలో ఆమె సోదరికి చిన్నచిన్న గాయాలు కూడా అయ్యాయి. పోచమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఏడుపాయల దర్శనానికి వెళ్తుండగా..

- కారు, ఆటో ఢీ
- ఒకరి మృతి.. ఐదుగురికి గాయాలు


ఘటనా స్థలంలో ఆటో, క్షతగాత్రులు


మృతుడు భాగరి నరేశ్ (ఫైల్)

కౌడిపల్లి(నర్సాపూర్): ఏడుపాయల దైవదర్శనానికి వెళ్తుండగా ఆటో, కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన కౌడిపల్లి మండలం తిమ్మాపూర్‌గేట్ సమీపంలో 765డి జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. కౌడిపల్లి ఎస్‌ఐ శివప్రసాద్‌రెడ్డి, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాయిలాపూర్ గ్రామానికి చెందిన భాగరి నరేశ్(40) భార్య మొగులమ్మ, బంధువులు నవీన్ జ్యోతి, సింధుజ, బాలమణి కలిసి ఏడుపాయల వనదుర్గాదేవి దర్శనం కోసం ఆటోలో బయలుదేరారు. కొద్ది దూరం వెళ్లగానే తిమ్మాపూర్‌గేట్ సమీపంలో ఆటోను మెదక్ నుంచి వస్తున్న కారు ఎదురుగా ఢీకొట్టింది. ఘటనలో నరేశ్‌కు తీవ్రగాయాలై ఆస్పత్రికి తరలించేలోపు మృతి చెందాడు. నరేశ్ భార్యతోపాటు బంధువులు ఐదుగురికి గాయాలయ్యాయి. బాధితులను నర్సాపూర్ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు. ఘటనా స్థలానికి టీపీసీసీ డెలిగేట్ ఆంజనేయులు గౌడ్ చేరుకొని క్షతగాత్రులను పరామర్శించి ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో రాయిలాపూర్ సర్పంచ్ శేఖులు, మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, తదితరులు బాధితులను పరామర్శించారు.